## క్లుప్తంగా

### ఉత్సాహంగా క్రీడా పోటీలు



**బాపట్ల:** మున్సిపల్ హైస్కూల్‌లో నెహ్రూ యువ కేంద్రం, యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో పురుషుల వాలీబాల్, కబడ్డీ మ్యాచ్‌లను ఆదివారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.రాజేశ్వరి ప్రారంభించారు. వాలీబాల్‌లో మున్సిపల్ హైస్కూల్ జట్టు విన్నర్‌గా, ముత్తాయిపాలెం జట్టు రన్నర్‌గా నిలిచింది. కబడ్డీలో బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు విన్నర్‌గా, రన్నర్స్ గా బాపట్ల కబడ్డీ జట్టు నిలిచింది. డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ దేవిరెడ్డి ఆదేశాలు మేరకు నేషనల్ యూత్ వలంటరీ శీలం త్రినేత్ర రెడ్డి, పీడీ కత్తి శ్రీనివాసరావు, పూల నాగేశ్వరరావు పోటీలను పర్యవేక్షించారు.

### ముగిసిన ధార్మిక కార్యక్రమాలు

**తాతావారిపాలెం(భట్టిప్రోలు):** శ్రీ లక్ష్మి అమ్మ వారిని పూజించడం వల్ల సకల సౌభాగ్యాలు కలిగి, ఆర్థి బాధలు తొలగిపోతాయని టీటీడీ ప్రోగ్రాం ఆఫీసర్ ఇ.అమ్మడు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సూరేపల్లి పంచాయతీ పరిధిలోని తాతావారిపాలెంలో ధార్మిక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. అమ్మవారికి కుంకుమార్చనతో కార్యక్రమం ముగిసింది. బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, నిర్వాహకులు పడమట సోములు, వాకా గోవర్ధన, పడమట శ్రీరామమ్మ, రాజ్యలక్ష్మి, రుక్మిణీదేవి, గోపాలకృష్ణమ్మ పాల్గన్నారు.

### ముగిసిన సేవా పథకం శిబిరం

**తెనాలిఅర్బన్:** జేఎంజే కళాశాల ఆధ్వర్యంలో చావావారిపాలెం గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సేవా పథక ప్రత్యేక శిబిరం శుక్రవారం ముగిసింది. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని రోడ్లు, కాల్వలను శుభ్రం చేయడంతో పాటు వివిధ ప్రాంతాల్లో మొక్కలను నాటారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో 28వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ యాతాటి అనిల్, ఘంటా కిరణ్, ఫిలిప్, బెజిమెన్, అధ్యాపకులు డాక్టర్ అరుణ సుజాత పాల్గొన్నారు.

### పేదలకు అన్నదానం

**తెనాలిఅర్బన్:** మహా శివరాత్రిని పురస్కరించుకుని శివాజీచౌక్‌లోని కాళీమాత ఆలయం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుమ్మడి రమేష్, కార్యదర్శి వై.శ్రీనివాసరావు, సభ్యులు మేక సురేష్, కందేపు సీతారామయ్య, నీరంజన్, మెడికల్ సుబ్బారావు, అడపాల శ్రీనివాసరావు, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

### వీడియో, ఫొటోగ్రాఫర్ల కొవ్వొత్తుల ర్యాలీ



**తెనాలిఅర్బన్:** మధురవాడకు చెందిన ఫొటోగ్రాఫర్ సాయికుమార్‌ను హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని తెనాలి వీడియోగ్రాఫర్స్ అండ్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సాయికుమార్ హత్యను నిరసిస్తూ పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సాయికుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఇలాంటి దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు.

### శుక్రవారం డ్రైడేగా పాటించండి

**తెనాలిఅర్బన్:** అందరూ శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని మలేరియా తెనాలి పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ కోరారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో బీసీ కాలనీలో శుక్రవారం దోమల నియంత్రణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాల్లో ఉన్న నీళ్ల క్యాన్‌లు, తొట్టెలను శుభ్రం చేయాలని కోరారు. ఇవన్నీ దోమల ఉత్పత్తికి కారకాలని వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, దాసరి శివనాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

### రైలు ఢీకొని వ్యక్తి మృతి

**తాడికొండ:** రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బండారుపల్లి రైల్వే ట్రాక్‌పై 12వ కిలోమీటరు వద్ద జరిగింది. రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి మార్చురీకి తరలించినట్లు రైల్వే జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావునాయక్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు నడికుడి జీఆర్పీ పోలీసుల్ని సంప్రదించాలని ఆయన సూచించారు.

# సర్వం.. శివోహం

- ఘనంగా శివరాత్రి పర్వదిన పూజలు
- శివ నామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక పూజల్లో నిమగ్నమైన మహిళలు

**శివరాత్రి పర్వదినం పట్టణ, పల్లెల్లోని శైవ క్షేత్రాలు భక్తులతో శుక్రవారం కిక్కిరిశాయి. సూర్యోదయానికి ముందే మహిళలు, భక్తులు ప్రత్యేక పూజల్లో నిమగ్నమయ్యారు. భక్త పారవశ్యంలో శివ నామస్మరణ సాయంత్రం వరకు ఆలయాల్లో మార్మోగింది.**



సూరేపల్లి శ్రీ కేదారేశ్వర వాయులింగానికి అభిషేకం

**బాపట్ల:** పట్టణంలోని సోమేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి కోటికం సుబ్బారావు శివరాత్రి మహిమలను భక్తులకు వివరించారు. రాత్రి 11.45గంటల నుంచి లింగోద్భవకాలంలో జరుగుతుందని తెలిపారు. మూడు స్థితులకు కారణమైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు ఒకే స్థానం శివలింగమని ఉపదేశించారు. శివలింగంలో మొదటి భాగం బ్రహ్మ, మధ్య భాగం విష్ణు, పై భాగం శివ రూపాలు అని అందు వల్లనే శివలింగాన్ని త్రిమూర్తి స్వరూపం అంటారని వివరించారు. శివలింగార్చన వల్ల సర్వ పాపాలు హరించబడతాయని తెలిపారు. పూజలనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

**భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు..**

పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలో గంగా పర్వత వర్ధని సమేత రామలింగేశ్వర స్వామి, వెదుళ్ళపల్లిలోని శ్రీరామలింగేశ్వరస్వామి, భర్తిపూడి గ్రామాల్లోని శైవక్షేత్రాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొని, పూజలు నిర్వహించారు.

**అంతా శివనామస్మరణే**

**పిట్టలవానిపాలెం:** అడిగిన వెంటనే వరాలిచ్చే మహాదేవుడు ఆ పరమ శివుడు లింగ రూపంలో ఉద్భవించిన పర్వదినం మండలంలోని శైవక్షేత్రాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖాజీపాలెం కాశీవిశ్వనాథ స్వామి, మంతెనవారిపాలెం శ్రీరామలింగేశ్వరస్వామి, చందోలు శ్రీలింగోద్భవ క్షేత్రం, అల్లూరు శివారు రెడ్లపాలెం శ్రీ శేషాచలమేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో చందోలు బండ్లమ్మ దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు బుద్దా వెంకట లక్ష్మి, ఐనంపూడి శ్రీనివాసరావు, మంతెన గంగరాజు, దెందుకూరి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.



పెదపులివర్రు రాజరాజ నరేంద్రస్వామి



ప్రత్యేక అలంకరణలో అనంతభోగేశ్వర స్వామి



బాపట్ల: ప్రత్యేక అలంకరణలో అగ్రహారం రామలింగేశ్వరస్వామి

**వైభవంగా మహా శివరాత్రి వేడుకలు**

**కర్లపాలెం:** మహాశివరాత్రి వేడుకలు మండలంలో శుక్రవారం వైభవంగా జరిగాయి. కర్లపాలెం బదరీ కేదారేశ్వరస్వామి ఆలయంలో శివస్వాములు స్వామివారి తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. గంగ, గౌరీ సమేత కేదారేశ్వరస్వామికి మహా రుద్రాభిషేకం, అర్చనలు, పుష్పార్చన చేశారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వాముల చిత్ర పటాలకు విశేష పూజలు నిర్వహించి, శివస్వాములకు చద్ది పంపిణీ చేశారు. కొత్త నందాయపాలెం శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో శాంతి హోమాలు నిర్వహించారు. బోలాయపాలెం శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి, పేరలి శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. శ్రీధర్మ శాస్త్ర స్వామీ అయ్యప్ప ఆలయంలోని శివలింగానికి, ఇందిరానగర్‌లోని ఆదిశేషుని ఆలయం, ఎంవీరాజుపాలెం కోదండ రామస్వామి ఆలయం, నల్లమోతువారిపాలెం లలితా త్రిపుర సుందరీ ఆలయాల్లోకి శివలింగాలకు అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. యాజలి, గణపవరం, పెదగొల్లపాలెం గ్రామాల్లోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

**వైభవంగా మహా శివరాత్రి వేడుకలు**

**కొల్లూరు :** మండలంలోని కోటిపల్లి సోమశేఖరాలయం, చిలుమూరులోని ఉభయరామలింగేశ్వర క్షేత్రం, కొల్లూరు అనంతభోగేశ్వరాలయాల్లో శివరాత్రి పర్వదినం శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంత భోగేశ్వరాలయంలో మహాలింగార్చన, లక్ష్మీగణపతి హోమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు.

**శివ నామస్మరణతో మార్మోగిన సూరేపల్లి**

**సూరేపల్లి(భట్టిప్రోలు):** హర హర మహదేవ శంభో శంకర నామస్మరణతో సూరేపల్లి గ్రామం మార్మోగింది. మహా శివరాత్రి పురస్కరించుకుని శుక్రవారం శ్రీ కేదారేశ్వర వాయులింగ ఆలయంలో శివ పార్వతుల కల్యాణం, తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రత్యేకంగా ప్రభను, గూడు బండ్లను సుందరంగా తీర్చిదిద్దారు. స్వామి వారికి భక్తులే స్వయంగా అభిషేకాలు చేశారు. కార్య నిర్వాహకుడు వల్లూరి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో కోలాటం, నృత్య ప్రదర్శన, శివ శక్తుల తాండవాలతో స్వామి వారి ఊరేగింపు గ్రామ వీధుల్లో వైభవంగా జరిగింది. పది వేల మందికి అన్నసంతర్పణ చేశారు. భట్టిప్రోలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.



అగ్రహారం శివాలయంలో అభిషేకాలు

**హర హర శంభో శంకర**

**భట్టిప్రోలు:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అతి ప్రాచీనమైన శ్రీ కంచి కామాక్షి సమేత శ్రీ బాలకోటేశ్వరస్వామి, దేవతల గుడిగా ప్రద్ధి గాంచిన శ్రీ గంగాపార్వతి సమేత శ్రీ విఠలేశ్వరస్వామి, పెదపులివర్రులోని బాలాత్రిపురసుందరీ సమేత శ్రీ రాజరాజ నరేంద్రస్వామి, ఓలేరులోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వార్లను భక్తులు శుక్రవారం అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయంలో వెల్లటూరు వంశీకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలా త్రిపురసుందరీ దేవి సమేత హేమవిఠలేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారికి లింగోద్భవ కాలంలో మహన్యాసక పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. దేవతల గుడిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ విఠలేశ్వరస్వామి దేవాలయంలో నందీశ్వరుడు చెవిలో తన కోరికలను చెప్పుకుని వెళ్లారు. వెల్లటూరులో అగస్త్య మహర్షి ప్రతిష్ఠించిన శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి లింగోద్భవ కాలంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు జరిగాయి. ఈఓ దీవి వేంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు. కల్యాణ మహోత్సవం తంగిరాల పిచ్చయ్యశాస్త్రి, యేలేశ్వరపు చిదంబర శాస్త్రి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. రాత్రి నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

## వైభవంగా ముక్తేశ్వరుని కల్యాణ మహోత్సవం

**రేపల్లె రూరల్:** మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దక్షిణ కాశీగా పేరొందిన మోర్తోట గ్రామంలో వేంచేసియున్న ముక్తేశ్వరస్వామి-పార్వతీదేవీల కల్యాణ మహోత్సవాలను రాచూరి జమీందార్ రాజామాణిక్యారావు సిద్ధార్థ మార్కండేయ రావు బహదూర్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు నిర్వాహణ చావలి సురేష్‌శర్మ పర్యవేక్షణలో శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి, అమ్మవారికి వేదపండితులు మంగళస్నానాలు ఆచరింపజేసి పట్టువస్త్రాలు, పువ్వులతో అలంకరించారు. ఆలయ ఆవరణంలో రాత్రి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. స్వామివారిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్-కేశవతి దంపతులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కల్యాణ వేడుకలో పాల్గొన్నారు. శివరాత్రి పర్వదినం రోజున శ్రీశైల పుణ్యక్షేత్రం తర్వాత రాష్ట్రంలో కేవలం మోర్తోట గ్రామంలో స్వామివారి కల్యాణ వేడుకలను జరపటం విశేషం.



ముక్తేశ్వరస్వామికి పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్



చందోలులో పాండవులు ప్రతిష్ఠించిన శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

## సచివాలయంలో మహిళా దినోత్సవం

**కర్లపాలెం:** మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారిని సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి మోడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**గృహ సారథులు, యానిమేటర్లకు సన్మానం**

**పెదపులివర్రు(భట్టిప్రోలు):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని జిలుగువారిపాలెంలో శుక్రవారం గృహ సారథులు, యానిమేటర్లను ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి ఘనంగా సన్మానించారు. మదర్ థెరిస్సా స్ఫూర్తితో సేవలు అందిస్తూ.. వీరవనిత ఝాన్సీ లక్ష్మీబాయ్‌లా ప్రతి మహిళా ధైర్య సాహసాలు కలిగి ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

## సహజీవనం.. ఆత్మహత్యాయత్నం

**కొల్లూరు :** సహజీవనం వల్ల కుటుంబంలో చెలరేగిన స్పర్థలు ఇద్దరి ఆత్మహత్యాయత్నానికి కారణమైంది. గతంలో మహిళ ఆత్మహత్యాయత్నం చేయగా..తాజాగా ఆమెతో సహజీవనం చేసిన వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇప్పుడు ఇద్దరి పరిస్థితి విషయమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కొల్లూరు శివారు కేటీ కాలనీకి చెందిన ప్రియాంక అనే మహిళతో గతంలో క్రాపకు చెందిన గుడిపూడి కిరణ్ అనే వ్యక్తి సహజీవనం చేశారు. అతని భార్యకు ఈ విషయం తెలిసి గొడవలు జరగడంతో.. మూడు నెలల క్రితం స్థానికంగా పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేశారు. ప్రియాంక, కిరణ్‌లు కలవకూడదని ఒప్పందం చేసుకొని, విడివిడిగా జీవిస్తున్నారు. పది రోజుల క్రితం కిరణ్ ఇంటికి రాకపోవడంతో.. అతని భార్య అనుమానంతో ప్రియాంక గృహానికి వెళ్లింది. అక్కడ తన భర్త లేకపోవడంతో ఇంటిలోని వస్తువులను ధ్వంసం చేసింది. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రియాంక ఫిర్యాదు చేసింది. అయితే తనకు పోలీసులు న్యాయం చేయడం లేదన్న ఆరోపణలతో ఆమె పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అప్పట్నుంచి ప్రియాంక వైద్యశాలలో చికిత్స పొందుతోంది. కిరణ్ వల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని జిల్లా ఎస్పీ స్పందన కార్యక్రమంలో ప్రియాంక తల్లి రాజ్యలక్ష్మి ఫిర్యాదు చేసింది. దీంతో కిరణ్‌ను రెండు రోజుల క్రితం వేమూరు సీఐ పి.రామకృష్ణ పిలిపించి, విచారణ జరిపి హెచ్చరించి పంపారు. అనంతరం క్రాప వెళ్లిన కిరణ్ స్థానికంగా ఉన్న రైస్ మిల్లు వెనుక ప్రాంతంలో పురుగు మందు తాగాడు. అతనితో ఉన్న స్నేహితుడు గమనించి మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మరో వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రియాంక పరిస్థితి సైతం విషమంగా ఉండటంతో గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి, వైద్య సేవలు అందజేస్తున్నారు. ఇరువురు ఆత్మహత్యాయత్నాల వెనుక పోలీసుల వ్యవహార శైలిపై వారి బంధువులు ఆరోపణలు చేస్తుండగా.. ఈ వ్యవహారంలో బాధితుల ఫిర్యాదుల మేరకే విచారణ జరిపామని, ఆత్మహత్యాయత్నాలకు వారి వ్యక్తిగత కారణలే కారణమని కొల్లూరు ఎస్ఐ రవీంద్రరెడ్డి స్పష్టం చేశారు.

## క్రైస్తవులపై దాడులను అరికట్టాలి

**ఏపీ క్రిస్టియన్ రైట్స్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ జాన్‌బాబు**

**తెనాలిటౌన్:** భారతదేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో మతోన్మాదులు క్రైస్తవులపై దాడుల చేస్తున్నారని ఆ దాడులను అరికట్టాలని ఏపీ క్రిస్టియన్ రైట్స్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ మత్రిపూడి జాన్‌బాబు కోరారు. రూరల్ మండలం కఠెవరంలో చర్చి వద్ద శుక్రవారం ఆర్గనైజేషన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జాన్‌బాబు మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ జనవాడలో అగ్రకులస్తులు దళిత క్రైస్తవులపై దాడుల చేసి రాళ్ళురువ్వి అద్దాలు పగలుకొట్టిన ఘటన సంచలనం సృష్టించదన్నారు. సమావేశంలో ఆర్గనైజేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రదర్ ఆనంద్‌కుమార్, సెక్రటరీ పాస్టర్ అబ్రహం, జాయింట్ సెక్రటరీ పాస్టర్ శ్యామ్‌సన్, కోశాధికారి పాస్టర్ రమేష్, పాస్టర్లు చిట్టిబాబు, జక్రయ్య పాల్గొన్నారు.



కఠెవరంలో చర్చి వద్ద మాట్లాడుతున్న ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ జాన్‌బాబు

## నేడు పెదకాకానిలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ

**పెదకాకాని:** మండల కేంద్రంలో శనివారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 5 కోట్ల ఎంపీ నిధులతో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు.

## ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ

**తెనాలిఅర్బన్:** తెనాలి పట్టణం14వ వార్డు పరిధిలోని ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు శుక్రవారం సచివాలయం వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ దాసరి వీరవసంతరావు, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లా గురునాథగుప్తా, వార్డు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

**31వ వార్డులో...**

**తెనాలిఅర్బన్:** తెనాలి నియోజకవర్గంలో 27 వేల ఇళ్ళ స్థలాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని 31వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి పేర్కొన్నారు. 31వ వార్డు పరిధిలోని సచివాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రావి శ్రీనివాసరావు, రాయల్ ప్రతాప్, కృష్ణ, మోహన్ రావు, మరియమ్మ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ వసంతరావు, శేషాచలం



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ మానసరెడ్డి

## ఆకట్టుకున్న నృత్య నీరాజనం



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

**పాత గుంటూరు:** మహా శివరాత్రి సందర్భంగా బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ శివపాద మంజీరనాదం పేరుతో 'శివరాత్రి నృత్య జాగరణ' వైభవంగా నిర్వహించింది. కార్యక్రమాన్ని బొల్లేపల్లి సత్యనారాయణ, సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కళాకారులు శుక్రవారం రాత్రి 7 గంటలకు ప్రారంభించి శనివారం ఉదయం 6 గంటల వరకు నృత్య ప్రదర్శనలు చేశారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు స్వాగతం పలికారు. సుమారు వంద మంది నర్తకులు పదకొండు గంటల పాటు చేసిన నృత్య నీరాజనం సాగింది. పాల్గొన్న వారందరికీ నంది ప్రతిమల్ని నిర్వాహకులు బహుమతిగా అందించారు. నాట్యాచార్య డాక్టర్ కాజ వేంకట సుబ్రహ్మణ్యం, నాట్యాచార్య బాలు, నాట్యాచారిణి నల్లపాటి సుశీల, నాట్యాచారిణి సాయిమంజీర శిష్యులు వివిధ కీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేసి భక్తుల్ని ఆకట్టుకున్నారు.

## చెట్టును ఢీకొట్టిన కారు



**జంపని(వేమూరు):** కారు చెట్టును ఢీ కొట్టడంతో అందులో ఉన్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు వివరాల మేరకు.. తెనాలి పట్టణంలోని జేవీఎం వైద్య శాల వైద్యుడు కోటి నాగయ్య కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని అబ్బనగూడవల్లి గ్రామంలోని విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం పూజలు చేయించారు. తిరుగు ప్రయాణంలో జంపని చెరువు దాటిన తర్వాత కారు చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వైద్యుడి భార్య, బంధువులు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు.

## మహిళలకు కుట్టుమెషిన్ల పంపిణీ

**తెనాలి:** మహిళల ఆర్థిక స్వావలంబనే దేశ ప్రగతిగా భారతీయ స్టేట్‌బ్యాంక్ ప్రాంతీయ అధికారి నోరి ప్రసాద్ చెప్పారు. మహిళాభ్యున్నతిలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా వెలుగొందుతోందని అభిప్రాయపడ్డారు. స్థానిక బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జేఎంజే మహిళా కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైనీని సత్కరించారు. భారతీయ స్టేట్‌బ్యాంక్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా తాడిశెట్టి పూజిత, షేక్ రజియా, సాదికలకు కుట్టుమిషన్లను అందజేశారు. చీఫ్ మేనేజర్ వెంకటేశ్వరరావు, హెచ్‌ఆర్ మేనేజర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## శ్మశానంలో బోరు ఏర్పాటు

**గుంటూరు రూరల్:** గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం తురకపాలెం గ్రామం బీసీ కాలనీ వాసుల శ్మశాన వాటికలో రూ.2 లక్షలతో బోరు ఏర్పాటుకు ఎంపీపీ శంకుస్థాపన చేశారు. ఇప్పటికే శ్మశాన వాటికకు ప్రహరీ ఏర్పాటు చేశామని, గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఎంపీపీ తెలిపారు. గ్రామ సర్పంచ్ డబ్బూరి సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

